



గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ స్తబ్దుగా ఉండటానికి కారణమేంటి..? సిటింగ్ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ఎందుకు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనట్లేదు..? ఈ ఎన్నికల్లో అసలు ఆయన గన్నవరం నుంచి పోటీ చేస్తారా..? లేక టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావుకు లభిస్తున్న ప్రజాదరణను చూసి వెనక్కి జంకుతున్నారా..? గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానీతో కలిసి సోమవారం సీఎం జగన్‌ను కలిసిన వంశీ సీటు మార్పు, నిధుల సమస్యపై చర్చించారా? అంటే.. అవుననే సమాధానాలు వైసీపీ శ్రేణుల నుంచి వస్తున్నాయి.

వంశీ దారెటు..?

కొద్దిరోజులుగా స్తబ్దుగా ఉంటున్న గన్నవరం ఎమ్మెల్యే

- నియోజకవర్గంలో ప్రచారానికీ దూరం
- టీడీపీ అభ్యర్థి యార్లగడ్డకు పెరుగుతున్న ప్రజాదరణ
- వంశీ వెనకడుగు వేస్తున్నారంటూ ఊహాగానాలు
- నియోజకవర్గ మార్పు, నిధులలేమిపైనా చర్చ
- కొడాలి నానీతో కలిసి సీఎంతో వంశీ భేటీ

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : గన్నవరం నియోజకవర్గం టీడీపీకి కంచుకోట. ఆ పార్టీ ఆవిర్భావం తర్వాత 9 సార్లు ఎన్నికలు జరిగితే, 6 సార్లు గెలిపించిన చరిత్ర గన్నవరం నియోజకవర్గ ప్రజలది. మరో రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. 1983 నుంచి ఎన్నికలను పరిశీలిస్తే, కాంగ్రెస్ కేవలం ఒక్కసారే విజయం సాధించింది. అలాంటి నియోజకవర్గంలో వంశీ టీడీపీ అభ్యర్థిగా గెలుపు సాధించడం పెద్ద విశేషమేమీ కాదు. 2019లో వంశీ టీడీపీ టికెట్‌పై గెలిచి వైసీపీ పంచన చేరాక ఆయన గ్రాఫ్ క్రమేణా తగ్గుతూ వచ్చింది. టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరిని అసభ్యంగా దూషించాక గ్రాఫ్ శరవేగంగా పడిపోవడం మొదలైంది. మరోవైపు టీడీపీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా యార్లగడ్డ వెంకట్రావు నియామకంతో శ్రేణుల్లో జోష్ పెరిగింది. ఈ పరిణామాలన్నింటినీ విశ్లేషించుకున్న వంశీ ఈసారి పోటీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు పలుమార్లు వైసీపీ పెద్దలకు చెబుతూ వచ్చారు. మరోవైపు వంశీ సుమారు రెండు నెలలకుపైగా నియోజకవర్గంలో ఎలాంటి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. గన్నవరం వచ్చినా కార్యాలయానికి లేదా పరామర్శలకు పరిమితమవుతున్నారు. ఈసారి వైసీపీ అభ్యర్థిగా గన్నవరం నుంచి పోటీ చేస్తారని అంతా భావిస్తున్న తరుణంలో వంశీ ధోరణి మాత్రం వేరుగా ఉంది. అసలు ఆయన పోటీ చేస్తారా, చేయరా అనే సందేహం వైసీపీ శ్రేణుల్లో కలుగుతోంది. ఈ నేపథ్యంలోనే సీఎంతో సోమవారం జరిగిన భేటీలో వంశీ సీటుపైనే ప్రధాన చర్చ జరిగినట్లు సమాచారం.

డబ్బు కోసమా.. భయపడుతున్నారా..?

ప్రతిసారీ ఎన్నికల ముందు నిధుల కోసం వంశీ 'పోటీ నుంచి విత్‌డ్రా' డ్రామా ఆడుతుంటారనేది నిజం. గత ఎన్నికల్లో ఆర్థిక ఇబ్బందులను సాకుగా చూపి పోటీకి విముఖత చూపిన వంశీ తాజాగా మళ్లీ అదే డ్రామా నడిపిస్తున్నారని రాజకీయ వర్గాల్లో నడుస్తున్న చర్చ. అయితే, టీడీపీ అధిష్ఠానంలా తాడేపల్లి పెద్దలు కరిగిపోరని, ఎదురు వంశీ నుంచే వసూలు చేస్తారని వైసీపీ శ్రేణులు చెబుతున్న మాట. గన్నవరంలో వంశీ రాకతో వైసీపీలో ఇద్దరు బలమైన నాయకులుగా ఉన్న యార్లగడ్డ వెంకట్రావు, దుట్టా రామచంద్రరావును పార్టీ దూరం చేసుకోవాల్సి వచ్చిందని, అలాంటిది ఎన్నికల సమయంలో వంశీ ఇలాంటి డ్రామాలు ఆడటమేమిటని వైసీపీ శ్రేణులు వ్యాఖ్యానిస్తున్నాయి. నిధుల కోసం కాకపోతే నియోజకవర్గంలో యార్లగడ్డ వెంకట్రావును చూసి వంశీ భయపడి పోటీకి వెనుకాడుతున్నారా అనే చర్చ కూడా వైసీపీ శ్రేణుల్లో నడుస్తోంది. 2014, 2019లో రెండుసార్లు టీడీపీ టికెట్‌పై వంశీ గెలుపొందారు. వరుస విజయాలతో ఆయన గన్నవరంపై పట్టు బిగించారు. ఈ పదేళ్లలో నియోజకవర్గంలో ఆయన అనుచరులు సాగించిన అవినీతికి అంతే లేదు. గత ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయిన వెంకట్రావుపై నియోజకవర్గ ప్రజల్లో సానుభూతి ఉంది. అదే సమయంలో ప్రభుత్వ వ్యతిరేకత.. వంశీ అనుచరుల అవినీతి.. వెరసి ఈసారి ఓటమి తప్పదనే భయంలో వంశీ ఉన్నారని సమాచారం. ఈ కారణంగానే ఆయన గన్నవరం నుంచి పోటీకి వెనుకాడుతున్నారని చెబుతున్నారు.

గన్నవరం కాకపోతే ఎక్కడ?

గన్నవరం నుంచి వంశీ పోటీచేయని పక్షంలో ఎక్కడి నుంచి బరిలోకి దిగుతారన్నది చర్చనీయాంశంగా మారింది. సోమవారం నాటి భేటీలో వంశీకి రెండు ఆప్షన్లు సూచించినట్లు తెలిసింది. ఒకటి పెనమలూరు నుంచి పోటీ చేయడం, రెండోది మైలవరం నియోజకవర్గానికి వెళ్లడం. ఈ రెంటిలో ఒకదాన్ని ఎంచుకోవాల్సిందిగా వైసీపీ పెద్దలు వంశీకి సూచించినట్లు తెలిసింది. దీనిపై వంశీ కూడా సానుకూలత చూపినట్లు తెలిసింది. ఏదేమైనా వారం, పది రోజుల్లో వంశీ పోటీచేసే స్థానంపై స్పష్టత రానుంది.



స.హ. ద్వారా అసైన్డ్ భూముల వివరాలు కోరుతున్న టీడీపీ నాయకులు

ఒక 'పట్టా'న తేలని అసైన్డ్

రైతులకు ఫారం-1, 2 నోటీసులిచ్చి ఫొటోలు తీసుకుని తిరిగి తీసుకుంటున్న వైనం

- అసైన్డ్ భూముల పూర్తి వివరాలు తెలియజేయాలని స.హ. చట్టం ద్వారా కోరిన టీడీపీ నేతలు
- అసైన్డ్ పట్టా పేరుతో వీఆర్వోలు, అధికార పార్టీ నాయకుల వసూళ్ల పర్వం?
- కోన 1, 2 రెవెన్యూ గ్రామాల పరిధిలో 4,200 ఎకరాల అసైన్డ్ భూమి

జిల్లా కేంద్రమైన మచిలీపట్నం మండలంలో అసైన్డ్ భూములకు పట్టాల మంజూరు వ్యవహారం ముదిరిపాకాన పడుతోంది. అధికార పార్టీ నాయకులు పేదలకు పట్టాలు ఇస్తామని ఆధార్ కార్డులు, బియ్యం కార్డుల జిరాక్స్ కాపీలను సేకరించి జాబితాలను తయారు చేస్తున్నారు. దీనికి బలం చేకూరుస్తూ వీఆర్వోలు గతంలో అసైన్డ్ భూములకు పట్టాలు పొందిన వారికి ఫారం-1, 2 నోటీసులు జారీ చేస్తున్నారు. అసైన్డ్ భూముల సర్వేకు ఖర్చులవుతున్నాయనే పేరుతో ఎకరానికి కనీసంగా రూ.5వేల చొప్పున వసూళ్లకు పాల్పడుతున్నారు. ఎన్నికలు కొద్దిరోజుల్లో జరగనున్న నేపథ్యంలో ఈ అసైన్డ్ భూములకు పట్టాలిచ్చే అంశంపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు మండలంలో 11 గ్రామాల్లో 12,311 ఎకరాల అసైన్డ్‌భూమి ఉన్నట్టు గుర్తించారు. ఈ భూమిని అర్హులైన పేదల పేరుతో పట్టాలిచ్చేందుకు అధికార పార్టీ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ భూమి ఎవరి చేతుల్లో ఉందనే అంశంపై గతంలో రెవెన్యూ సిబ్బందితో సర్వే చేయించారు. ఈ సర్వేలో 2,183 ఎకరాల భూమి 1570 మంది అసలు రైతులు లేదా వారి వారసులు సాగు చేసుకుంటున్నట్టు తేల్చారు. 9,729 ఎకరాల భూమి 5వేల మంది స్వాధీనంలో ఉన్నట్టు గుర్తించారు. 387 ఎకరాల భూమి అసైన్‌మెంట్ చేయడానికి అవకాశంవారసులకు ఫారం-1, 2 నోటీసులను జారీ లేదని తేల్చారు. ప్రస్తుతం వీఆర్వోల ద్వారా అసైన్డ్ భూములకు గతంలో

- మిగతా 6లో



స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య

- 6లో..

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ



డ్రై కంపోస్ట్ బెడ్ తయారీ విధానాన్ని వివరిస్తున్న సలహాదారు శ్రీనివాసన్

దేశానికే ఆదర్శంగా స్వచ్ఛ చల్లపల్లి

- 6లో..

» స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రాజాబాబు

- 6లో..

తరగతి గది.. ఇంతేలే..!

నిర్మాణ భవనంలో చుట్టూ పరదాలు కట్టి నిర్వహిస్తున్న తరగతి గది



గుడివాడలో మొండిగోడలతో వెక్కిరిస్తున్న నాడు-నేడు పనులు

విద్యాశాఖలో సమూల మార్పులు తెచ్చానని, ఎన్నడూలేని విధంగా నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాల భవనాలను నిర్మిస్తున్నానని సీఎం జగన్మోహన్‌రెడ్డి చెబుతున్న మాటలు వట్టి బూటకమని స్పష్టమవుతోంది. గుడివాడలోని మూడు పాఠశాలల అదనపు గదుల నిర్మాణ పనులు మూడేళ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఎప్పటికి పూర్తి అవుతాయో కూడా తెలీదు. బిల్లులు ఇవ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. విద్యార్థులకు చెట్ల కింద బోధన చేయాల్సిన దుస్థితి నెలకొంది.

మూడేళ్లుగా ముందుకు సాగని తరగతి గదుల నిర్మాణం

» పైసా బిల్లు చెల్లించని జగన్ సర్కారు
» ఎంపీ లాడ్స్ నిధులతో కొన్ని పనులు మాత్రమే పూర్తి



అసంపూర్తిగా మిగిలిన పార్కు పాఠశాల భవనం

గుడివాడ : నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా గుడివాడలో రెండు ఫేజ్‌లలో పలు పాఠశాలలకు నిధులను విడుదల చేశారు. కొన్ని పాఠశాలలకు చిన్నపాటి మరమ్మతులు చేపట్టారు. మరికొన్ని పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మూడేళ్లుగా భవన నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి.

● పార్కు పాఠశాలలో గదుల కొరత

పార్కు పాఠశాలలో నాడు-నేడులో భాగంగా 4 గదులు, ఎంపీ లాడ్స్ నిధులు నుంచి రూ.1.50 కోట్లతో మరో 8 అదనపు తరగతి గదులు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. కాంట్రాక్టరు శ్లాబులు మాత్రమే వేసి వదలేశారు. మూడేళ్లుగా నిర్మాణం సాగుతూ ఉంది. నాడు-నేడు కింద నేటికీ ఒక్క పైసా కూడా నిధులు విడుదల కాలేదు. ఎంపీ లాడ్స్ నుంచి రూ.42.50 లక్షలు నిధులు విడుదలయ్యాయి. వాటితోనే కొన్ని పనులు జరిగాయి. పాఠశాల ఆవరణలో ఉన్న ఒక రేకుల షెడ్డులో కాంట్రాక్టరు సిమెంట్‌ను నిల్వ చేయడంతో నాలుగు పక్కల గోడలు కూలే స్థితిలో ఉంది.

● వసతుల్లేక తగ్గుతున్న విద్యార్థులు

పాఠశాలలో ఏటికేడూ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. టీడీపీ హయాంలో 500కి పైబడి ఉన్న విద్యార్థుల సంఖ్య 2023-24 విద్యా సంవత్సరం నాటికి 300కి పడిపోయింది. కనీస సౌకర్యాలు లేకపోవడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ఇతర పాఠశాలలకు పంపతున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు కూడా సరిపడా గదులు లేకపోవడంతో నిర్మాణంలో ఉన్న భవనాల్లోనే 4, 5 తరగతులకు చెందిన రెండు సెక్షన్లు మిళితం చేసి బోధిస్తున్నారు. కింద కూర్చునేందుకు విద్యార్థుల కోసం పరదాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఎండ వేడి తగలకుండా పరదాలను అడ్డుపెట్టారు. వర్షం వస్తే తడుస్తూ పాఠాలు వినాల్సిందే.

ఏకేటీపీ పాఠశాలలో చెట్ల కింద బోధన


ఏకేటీపీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలోనూ నాడు-నేడులో 4 గదులు, ఎంపీ ల్యాడ్స్ నుంచి 8 అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టరు శ్లాబు పూర్తి చేశారు. నాడు-నేడు కింద నేటికీ ఒక్క పైసా కూడా విడుదల చేయలేదు. ఎంపీ లాడ్స్ నుంచి రూ.42.50 లక్షలు విడుదలయ్యాయి. పాఠశాల ప్రాంగణంలో ఇసుక గుట్టలుగా ఉండటంతో విద్యార్థులు ఆటలు ఆడేందుకు కూడా వెసలబాటు లేకుండా పోయింది. గదులు లేక కొన్ని తరగతులను వరండాల్లో నిర్వహిస్తున్నారు. అప్పడప్పుడు చెట్ల కింద విద్యాబోధన చేస్తున్నారు.

ఎస్‌పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఇలా..

నాడు-నేడులో 16 అదనపు తరగతి గదులు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఇక్కడ 8 గదులు పూర్తికావచ్చాయి. మరో 8 గదులు పనులు ఎప్పటికి ప్రారంభిస్తారో తెలియదు. నాడు-నేడు కింద 30 శాతం నిధులు విడుదలయ్యాయి. మిగిలిన నిధులు ఎప్పటికి వస్తాయో తెలియని అయోమయ స్థితి నెలకొంది.

మట్టి దందా.. నయా పంథా..!

మైనింగ్ మాఫియాతో కలిసి రెవెన్యూ విభాగం అక్రమం



కొత్తూరు తాడేపల్లిలో చెరువుగా ఉన్న ప్రభుత్వ భూమిలో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

- ప్రభుత్వ భూములు గుర్తించి చెబుతున్న రెవెన్యూ అక్రమార్కులు
- గద్దల్లా వాలిపోతున్న మైనింగ్ మాఫియా
- కొత్తూరు తాడేపల్లిలో 14 ఎకరాల్లో మట్టి తవ్వకాలు
- రూ.100 కోట్లకుపైగా వ్యాపారం
- అక్రమంలో రెవెన్యూ వాటా రూ.10 కోట్లు
- సాక్ష్యాలతో కలెక్టర్‌కు గ్రామస్తుల ఫిర్యాదు

కొండలను కొల్లగొట్టారు. గుట్టలను గుల్ల చేశారు. ఇవి చాలవన్నట్టు ఇప్పుడు ప్రభుత్వ భూములపై మైనింగ్ అక్రమార్కులు కన్నేశారు. వారికి రెవెన్యూ అధికారులు జత కలిశారు. రీసర్వేలో ప్రభుత్వ భూములను గుర్తించడం.. మైనింగ్ మాఫియాకు సమాచారం అందించడం.. ఆ భూముల్లో ఎవరైనా సాగు చేస్తుంటే బెదిరించి మైనింగ్ మాఫియాకు అమ్మేసుకునేలా భయభ్రాంతులకు గురిచేయడం రెవెన్యూ విభాగంలోని కొందరు అక్రమార్కులు విధిగా మారింది. వాటిని అతి తక్కువ ధరకు చేజిక్కించుకున్న మైనింగ్ అక్రమార్కులు ఆ వెంటనే మట్టి తవ్వి అమ్మి సొమ్ము చేసుకొని రూ.కోట్లలో ఆదాయం అర్జిస్తున్నారు. ఇలా విజయవాడ మండలంలో కొత్తూరు తాడేపల్లిలో 14.04 ఎకరాల్లో మట్టి తవ్వి రూ.100 కోట్లకుపైనే వ్యాపారం చేసినట్టు అంచనా. ఈ పాపంలో భాగమైన రెవెన్యూకు రూ.10 కోట్లకుపైగా ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ

రెవెన్యూ మాఫియా అలెర్ట్ వాట్సాప్ గ్రూప్

మైనింగ్ మాఫియాతో ఉన్న భాగస్వామ్య వ్యాపారం కారణంగా వారిపై దాడులు జరపకుండా ఉండేందుకు స్థానిక రెవెన్యూ మాఫియా 'అలెర్ట్' అనే వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. ఈ గ్రూప్ ద్వారా ప్రజల నుంచి రెవెన్యూ అధికారులకు వస్తున్న ఫిర్యాదులు, అధికారులు ఆరా తీస్తున్న సమాచారాలు, తనిఖీలకు వచ్చే అవకాశాల సమాచారం ఎప్పటికప్పుడు మైనింగ్ మాఫియాకు చేరుతోంది. ప్రభుత్వ భూములను మైనింగ్ గద్దలకు అన్యాక్రాంతం చేసిన రెవెన్యూ మాఫియాకు తమ వాటాగా వచ్చిన రూ.10 కోట్ల షేర్‌తో భారీగా ఆస్తులు సమకూర్చుకున్నట్టుగా రెవెన్యూలో చర్చనీయాంశంగా మారింది.

స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు

విజయవాడ మండలంలోని ప్రభుత్వ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న మైనింగ్ మాఫియా ఆగడాలపై సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ దిల్లీరావుకు కొత్తూరు తాడేపల్లి గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వుతున్న విషయాన్ని తాము గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోలేదని, ఇపుడు చూస్తే ప్రభుత్వ భూములను మొత్తంగా తవ్వేశారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సత్వరం చర్యలు చేపడతామని కలెక్టర్ దిల్లీరావు హామీ ఇచ్చారు.

● సర్వే నంబర్ 135లో తవ్వకం..



కొత్తూరు తాడేపల్లిలోని 4 ఎకరాల ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వి వాహనాల్లో తరలిస్తున్న అక్రమార్కులు

కొత్తూరు తాడేపల్లిలో సర్వే నెంబర్ 135లో కొండ వాగు పోరంబోకు భూమి 4 ఎకరాలుంది. కొద్దికాలం కిందట జరిగిన భూముల రీ సర్వేలో ఇది ప్రభుత్వ భూమిగా తేలింది. రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. స్థానిక ఆర్ఐ ద్వారా ఈ సమాచారం మైనింగ్ మాఫియాకు చేరింది. రీ సర్వేకు ముందు ఈ భూములు కొందరు రైతుల ఆధీనం లో ఉండటంతో వారిని రెవెన్యూ అధికారులు బెదిరించి లొంగదీసు కున్నారు. మైనింగ్ మాఫియాకు తక్కువ ధరకు అమ్ముకునే స్థాయిలో బెదిరింపులకు దిగారు. ఎకరం రూ.30 లక్షల వరకు ఇచ్చేందుకు మైనింగ్ గద్దలు నిర్ణయించటంతో రైతులు ఈ భూముల ను వారి చేతుల్లో పెట్టారు. గ్రావెల్ తవ్వకాలు ప్రారంభించారు. మట్టి అమ్మి భారీగా డబ్బు పోగేశారు.

అక్కడితో ఆగక.. మరో ప్రాంతానికి విస్తరణ

విజయవాడ మండల రెవెన్యూ మాఫియా మరింత బరి తెగించింది. కొత్తూరు తాడేపల్లిలోని సర్వే నెంబర్ 248లోని 10.04 ఎకరాలు చెరువు భూమిగా రీసర్వేలో తేలింది. ఈ భూములను కూడా రైతులను భయపెట్టి మైనింగ్ గద్దలు చెరపట్టేలా చేసింది. ఆ భూముల్లో మాఫియా గ్రావెల్ తవ్వకాలు చేపట్టింది. రెండు సర్వేనంబర్లలో కలిపి 14.04 ఎకరాల్లో మైనింగ్ మాఫియా రూ.100 కోట్ల వ్యాపారం చేసినట్టు తెలుస్తోంది. మైనింగ్ మాఫియాకు సహకరించినందుకు రెవెన్యూ అక్రమార్కులకు రూ.10 కోట్ల మేర వాటా వెళ్లినట్టు తెలుస్తోంది.



సుబ్రహ్మణ్యేశ్వర దేవస్థానం, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి(ఇన్‌సెట్)

నేటి నుంచి సుబ్బారాయుడి కల్యాణ మహోత్సవాలు

మోపిదేవి, ఫిబ్రవరి 12 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మాఘమాసంలో ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా స్వామివారి ఉత్సవాలు నిర్వహించనున్నారు. 13వ తేదీ ఉదయం 11 గంటలకు శ్రీ స్వామివారిని పెండ్లి కుమారుడిని చేయుటతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 17వ తేదీ సుబ్రహ్మణ్య హవనం, ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపు సేవతో మహోత్సవాలు ముగుస్తాయి. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. స్వామివారికి నిర్వహించే నిత్య పూజా కార్యక్రమాలు తాత్కాలికంగా రద్దు చేసినట్టు ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు.

తిరుపతమ్మకు హుండీ ఆదాయం రూ.6.37 లక్షలు

మైలవరం రూరల్ : బొర్రగూడెం గ్రామం తిరుపతమ్మ - గోపయ్య వార్ల దేవస్థానంలోని హుండీల ఆదాయం సోమవారం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్యవరప్రసాద్, భక్తులు, హిందూ భక్తసమాజ సభ్యుల సమక్షంలో వేదాద్రి శ్రీయోగానంద లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈవో కె.హేమలత పర్యవేక్షణలో లెక్కించగా 208 రోజులకుగాను భక్తులు కానుకలుగా రూ.6,37,003లు సమర్పించినట్టు ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు తెలిపారు. దేవస్థానంలో భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునే హక్కుకు ఏడాదిలో నాలుగు సార్లు నిర్వహించిన వేలం పాటలో రూ2.18 లక్షల హెచ్చుపాటగా చౌటపల్‌కు చెందిన బొజ్జా ఏడుకొండలు దక్కించుకున్నట్టు ఈవో తెలిపారు.

వైసీపీకి ఇద్దరు ప్రధాన కార్యదర్శులు బైబై

- పార్టీ పదవులతోపాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా
- ఎస్సీ, బీసీలకు వెలంపల్లి అన్యాయం చేశారు
- పార్టీలో కష్టించి పని చేసేవారికి గుర్తింపు లేదు



రాజీనామా పత్రాలు చూపుతున్న అమర్ బాబు, పాలవాయి దాసు

చిట్టినగర్, ఫిబ్రవరి 12 : విజయవాడ చిట్టినగర్‌కు చెందిన ఇద్దరు వైసీపీ నాయకులు పార్టీ పదవులతో పాటు ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ మేరకు సోమవారం కేఎల్‌రావు పార్కు ఎదురుగా కేటీ రోడ్డులో మీడియా సమావేశంలో వివరాలు తెలియజేశారు. 47వ డివిజన్‌కు చెందిన వైసీపీ నగర ప్రధాన కార్యదర్శి ఎనిగళ్ల అమర్‌బాబు, 46వ డివిజన్‌కు చెందిన ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి పాలవాయి దాసులు తమ పదవులతోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీకి చేసిన సేవలను గుర్తించి విజయవాడ నగర ప్రధాన కార్యదర్శిగా పదవి ఇచ్చారన్నారు. 2019లో పశ్చిమ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు విజయానికి తన వంతు కృషి చేస్తే ఆయన తనలాంటి వారిని గుర్తించలేదన్నారు. భజన బృందాలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి తమకు అన్యాయం చేశారన్నారు. పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జీ షేక్ ఆసిఫ్ అవినీతిలో కూరుకుపోయిన వారికి, భజన బృందాలను చేరదిస్తూ పనిచేసే సీనియర్లను పట్టించుకోవడంలేదన్నారు. దళితులకు భద్రత లేదన్నారు. ఈ పరిణామాలకు కలత చెంది తాము పార్టీ, పదవులకు రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు.

ఆడుదాం ఆంధ్రా మహిళా క్రికెట్ చాంప్ ఎన్టీఆర్ జిల్లా



విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12 : విశాఖపట్నం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రీడామైదానంలో జరిగిన ఆడుదాం-ఆంధ్రా రాష్ట్రస్థాయి మహిళల క్రికెట్ పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జట్టు ఘన విజయం సాధించినట్టు ఎన్టీఆర్ జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి ఆర్.సీజర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టుకు భావన నాయకత్వం వహించగా తూర్పుగోదావరి జిల్లాపై ఘన విజయం సాధించి టైటిల్‌ను వశం చేసుకుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా జట్టు 61 పరుగులు చేయగా, తూర్పుగోదావరి జట్టు 48 పరుగులే చేసి పరాజయం పాలైంది. మహిళా జట్టును ఎన్టీఆర్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ.అజీజ్ అభినందించారు.

కిడ్నీ ప్రభావిత గ్రామాలకు తాగు నీరివ్వండి..

- 15న నీటి సత్యాగ్రహ పాదయాత్ర
- కొలికపూడి శ్రీనివాసరావు వెల్లడి



ఎ.కొండూరు, ఫిబ్రవరి 12 : రాష్ట్రంలోనే మరో ఉద్దానంగా పేరుగాంచిన ఎ.కొండూరు మండలంలో తక్షణం కృష్ణాజలాలు సరఫరా చేసి తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ఈ నెల 15న నీటి సత్యాగ్రహ పాదయాత్ర చేస్తామని అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పది రోజులుగా కిడ్నీ ప్రభావిత గ్రామాలకు కృష్ణా జలాలు నిలిచిపోవడంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చీమలపాడులో ఆయన మాట్లాడుతూ, మండలంలో తాగు నీటి సమస్యను ఈ నెల 15లోగా పరిష్కారించకపోతే నీటి సత్యాగ్రహ పాదయాత్ర చేస్తామని ప్రకటించారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ప్రజలపైన, టీడీపీ కార్యకర్తలపైన ఉందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే కిడ్నీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, అబ్బు, మునియ్య, డేవిడ్‌రాజ్, శంకర్, భీమా నాయక్, పీక్లా నాయక్, కిషోర్, దుర్గారావు, రాంప్రసాదరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర కన్వీనర్ దయాకర్

వడ్డెర్ల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.1500 కోట్లు కేటాయించాలి

- వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ దయాకర్

గుడివాడ, ఫిబ్రవరి 12 : రాష్ట్ర బడ్జెట్‌లో వడ్డెర్ల అభివృద్ధి, సంక్షేమానికి రూ.1500 కోట్లు నిధులను కేటాయించాలని, ప్రత్యేక రక్షణ సామాజిక చట్టాన్ని ఏర్పాటు చేయాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎన్జీవోస్ హోంలో సంఘం సభ్యులు ఉప్పుదల ఏడుకొండలు అధ్యక్షతన వడ్డెర వృత్తిదారుల సంఘం కృష్ణా జిల్లా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయం, చేతివృత్తులు పూర్తి దెబ్బతిన్నాయని, దీంతో లక్షలాది మంది వడ్డెర్లు ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి బతకాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఉన్న ఆశ్రమ పాఠశాలలను తీసివేయడంతో విద్యకు కూడా దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 90 శాతం సబ్సిడీతో వడ్డెర వృత్తిదారులకు అధునాతన యంత్రాలను అందజేసి ఉపాధి కల్పించాలని, కేజీ నుంచి పీజీ వరకు మెరుగైన విద్య, వృత్తి రీత్యా చనిపోయిన వారి కుటుంబానికి రూ.20లక్షలు నష్టపరిహారం, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ యివ్వాలని డిమాండ్ చేశారు. సదస్సులో సంఘం పట్టణ గౌరవాధ్యక్షుడు తమ్మిశెట్టి లక్ష్మణరావు, వడ్డెర్లు పాల్గొన్నారు. వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.

స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ



డాక్టర్ పట్టాభిరామయ్యకు పెన్ను, పుస్తకం ఇస్తున్న సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ

లబ్బీపేట, ఫిబ్రవరి 12 : వైద్య వృత్తిలో లాభాపేక్ష లేకుండా సమాజ సేవ కోసమే పనిచేసిన మహోన్నత వ్యక్తి, స్ఫూర్తి ప్రదాత డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య అని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ అన్నారు. 60 సంవత్సరాల వృత్తి విరామ అభినందన సత్కార కార్యక్రమం గురునానక్‌నగర్‌లోని ఎన్ఏసీ కళ్యాణ మండపంలో సోమవారం జరిగింది. కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన ఎన్వీ రమణ మాట్లాడుతూ, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య మానత్వానికి నిలువెత్తు నిదర్శనంగా.. సమాజంలో అన్ని వర్గాల నుంచి గౌరవం అందుకున్నారన్నారు. నైతిక విలువలతో జీవితాన్ని సాగించిన ఆయన నుంచి ఎంతో మంది డాక్టర్లు స్ఫూర్తి పొందారన్నారు. జీవితంలో కొందరితో మాట్లాడితే ఎంతో సంతోషం కలుగుతుందని అటువంటి వ్యక్తి పట్టాభిరామయ్య అని, ఆయన అభిమానం, ఆశీస్సులతో తాను ఈ స్థాయికి వచ్చినట్టు చెప్పారు. ఆయన వైద్య వృత్తి నుంచి మాత్రమే విరామం తీసుకున్నారని, ఆలోచనలు, సమాజసేవ నుంచి కాదన్నారు. ఆయన అంకిత భావం, సేవలను ముందుతరాలకు అందించేందుకు పట్టాభి రామయ్యను పుస్తకం వ్రాయాలని ఆయనకు పెన్ను, పుస్తకం అందజేశారు. లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ మాట్లాడుతూ, పట్టాభిరామయ్య సంకల్పానికి, ఆలోచనకు, సేవకు వృద్ధాప్యం లేదన్నారు. ఎందరో యువ డాక్టర్లకు ఆదర్శంగా నిలిచిన ఆయన కృష్ణాజిల్లాకు, నగరానికి వన్నె తెచ్చారన్నారు. అనంతరం డాక్టర్ పట్టాభిరమయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, కార్యక్రమ కమిటీ సభ్యులు బి.ఎస్ కోటేశ్వరరావు, డాక్టర్లు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా స్వచ్ఛ చల్లపల్లి

- చల్లపల్లి గ్రామాన్ని సందర్శించిన ఐఏఎస్ అధికారులు



చల్లపల్లి సంపద తయారీ కేంద్ర ప్రాంగణంలో డ్రై కంపోస్ట్ బెడ్ ప్రారంభించిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, చిత్రంలో ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్, కలెక్టర్ రాజాబాబు

చల్లపల్లి, ఫిబ్రవరి 12 : చల్లపల్లి గ్రామాన్ని దేశానికే ఆదర్శంగా.. మరో అంబికాపూర్‌గా తయారు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఆకాంక్షించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు, జిల్లా కలెక్టర్ పి.రాజాబాబులతో కలిసి సోమవారం సాయంత్రం చల్లపల్లి వచ్చిన ఆయన ఘన, ద్రవ వనరుల నిర్వహణ ప్రారంభోత్సవం(ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టు)లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎక్కడైనా గ్రామంలో డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని కోరటం చూస్తున్నామనీ, కానీ చల్లపల్లిలో డంపింగ్ యార్డును మూసివేయటం చారిత్రక ఘట్టమనీ, డంపింగ్‌యార్డు మూసివేసిన గ్రామంగా చల్లపల్లికి గుర్తింపు లభిస్తుందన్నారు. సర్పంచ్ కృష్ణకుమారిని అభినందించారు. ప్రజల ఆలోచనా విధానం మారాలనీ, ఇంటి నుంచే చెత్త విభజన జరగాలన్నారు. చల్లపల్లికి నిధుల పరంగా, మౌలిక సదుపాయాల పరంగా మద్దతు ఇస్తామన్నారు. ఈ సందర్భంగా డీఆర్కే దంపతులను అభినందించారు. రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్‌ను గార్బేజ్ ఫ్రీ రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలో ఐదు గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా చేశామనీ, రెండవ విడతలో అన్ని జిల్లాల్లో కొన్ని గ్రామ పంచాయతీలను ఎంపికచేసి ఇప్పటివరకూ జరిగిన ప్రయోగాత్మక విధానాలను అనుసరింపచేయనున్నట్లు వివరించారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ గంధం చంద్రుడు మాట్లాడుతూ, డంపింగ్ యార్డు లేని గ్రామంగా చల్లపల్లి దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ, వ్యర్థాల నిర్వహణ విషయాల గురించి ప్రజలకు వివరించి ఆచరించేలా వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ, అందరి సహకారం ఉన్నప్పుడే డంపింగ్ యార్డు లేని చల్లపల్లి మిగతా ప్రాంతాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. పర్యావరణవేత్త, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు శ్రీనివాసన్ మాట్లాడుతూ, ఇంత పెద్దసంఖ్యలో కార్యకర్తలు స్వచ్ఛందంగా సేవలందించటం దేశంలో మరెక్కడా లేదని చెప్పారు. డాక్టర్ డీఆర్కే ప్రసాద్ మాట్లాడుతూ, చెత్త..వ్యర్థాలు లేని గ్రామంగా చల్లపల్లి మరో అంబికాపూర్ కావాలని ఆకాంక్షించారు. డీపీవో ఎస్ వి.నాగేశ్వరనాయక్ అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, స్వచ్ఛ సారధి డాక్టర్ పద్మావతి, సీఈవో వీర్ల జ్యోతిబసు, ఎంపీపీ కోట విజయ రాధిక, ఈవో పివి.మాధవేంద్రరావు, అధికారులు, డ్వాక్రా, ఉద్యోగులు, స్వచ్ఛకార్యకర్తలు పాల్గొన్నారు. తొలుత స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సలహాదారు వేలేరు శ్రీనివాసన్ సూచనలతో సర్పంచ్ కృష్ణకుమారి, డాక్టర్ డీఆర్కే, డాక్టర్ పద్మావతిల నేతృత్వంలో స్వచ్ఛ కార్యకర్తలు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు తయారుచేసిన డ్రై కంపోస్ట్ బెడ్‌ను, ఘన..ద్రవ వనరుల నిర్వహణలో వివిధ విభాగాలను ఐఏఎస్ అధికారులు, ఎమ్మెల్యే ప్రారంభించారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లాలో 33007మంది విద్యార్థులు, 178 కేంద్రాలు 5 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 12 : మార్చి 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జరిగే 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా విద్యాశాఖ సహాయ సంచాలకులు కేఎస్‌వీ కుమార్ పరీక్షలకు సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. జిల్లాలో 10వ తరగతి పరీక్షలకు మొత్తం 33007 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో 17414 మంది బాలురు, 15593 మంది బాలికలు వున్నారని, వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 28190 మంది అని, అలాగే ప్రైవేట్ విద్యార్థులు 4817 మొత్తం 33007 అని తెలిపారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 178 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. పరీక్షల నిర్వహణకు 178 చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులను, 1475 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి 12.45 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులను 8.45 గంటలకు కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఆలస్యంగా వచ్చిన వారిని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. అధికారులు అప్రమత్తంగా వుండి ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పరీక్ష కేంద్రాలను ముందుగానే తనిఖీ చేయాలని, ఏమైనా లోటుపాట్లు వుంటే సరిచేసుకొని సిద్ధంగా వుంచాలన్నారు. అలాగే సమస్యాత్మక కేంద్రాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు. పరీక్షలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు.



అధికారులతో సమావేశంలో కలెక్టర్ దిల్లీరావు

ఎన్నికల విధుల్లో అప్రమత్తం

- జిల్లా అధికారులతో కృష్ణా కలెక్టర్ రాజాబాబు సమీక్ష

మచిలీపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్పందన కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ పుహాలులో అధికారులతో కలిసి ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల విజ్ఞప్తులపై సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 116 అర్జీలను ప్రజలు సమర్పించారు. రానున్న సాధారణ ఎన్నికలకు అధికారులంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఎన్నికల విధులకు హాజరయ్యే అధికారులందరికీ త్వరలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల విధులకు గైర్హాజరైతే తగుచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఆర్వో చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఆర్‌డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా వ్యవసాయశాఖ జేడీ ఎన్.పద్మావతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 55మంది నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత పోలీస్ అధికారులతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

బతికే ఉన్నా..
రేషన్ కార్డు పునరుద్ధరించండి



మచిలీపట్నం టౌన్ : తాను బతికే ఉన్నానని, తన రేషన్ కార్డు పునరుద్ధరించాలంటూ దళితుడు సోమవారం కలెక్టరేట్ వద్ద మీడియాతో తన గోడు చెప్పుకున్నాడు. తాను చనిపోయాయని కార్డును తొలగించారన్నారు. తాను నివశిస్తున్న వల్లూరుపాలెం గ్రామంలో తనకు ఓటు హక్కు ఉందన్నారు. తనకు తల్లిదండ్రులు లేరని, మేనత్త పెంచి పెద్ద చేసిందన్నారు. తన రేషన్ కార్డును పునరుద్ధరించాలంటూ బాధితుడు కలెక్టరేట్ వద్ద మేనత్తతో కలిసి ప్రదర్శన నిర్వహించాడు.

నిబద్ధతతో పనిచేయాలి..

- ఏఆర్‌వోల శిక్షణలో అదనపు సీఈవో కోటేశ్వరరావు


కృష్ణలంక, ఫిబ్రవరి 12 : ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన ఎన్నికల విధుల నిర్వహణకు సంబంధించి అన్ని అంశాలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించుకొని, అప్రమత్తత, నిబద్ధతతో పనిచేయాలని రాష్ట్ర అదనపు చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ పి.కోటేశ్వరరావు అన్నారు. విజయవాడలోని మేరీస్టెల్లా కాలేజీలో అసెంబ్లీ నియోజకవర్గాల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ (ఏఆర్‌వో)లకు సర్టిఫికేషన్ ప్రోగ్రాం జరిగింది. తూర్పు గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం, ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లాల ఏఆర్‌వోలకు ఐదు రోజుల శిక్షణా కార్యక్రమంలో జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనర్లు ఆశిష్‌కుమార్ జీనా, ఎ.ఫెలిక్స్ రాజా, రాజేష్‌కుమార్, యుక్తామిశ్రాలతో పాటు ఏపీ అదనపు సీఈవో కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు, డిప్యూటీ సీఈవో ఎస్.మల్లిబాబు, డీఆర్‌వో వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణలో ఆర్వో, పీవోల పాత్ర చాలా కీలకమైందని, ఎన్నికల విధుల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. తొలిదశలో ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు 118 మంది ఏఆర్‌వోలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటున్న వారికి భోజన వసతి సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. జాతీయ స్థాయి మాస్టర్ ట్రైనర్ రిసోర్స్‌పర్సన్ ఆశిష్ కుమార్ జీనా మాట్లాడుతూ, ప్రతి ఎన్నికలను కొత్తవిగానే భావించి ప్రతి అంశంపైనా స్పష్టమైన అవగాహనతో విధులు నిర్వర్తించడం ద్వారా ఎన్నికలను విజయవంతంగా నిర్వహించవచ్చని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న అదనపు సీఈవో కోటేశ్వరరావు

స్పందనలో118 అర్జీలు.. కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, ఫిబ్రవరి 12 : జిల్లాలో స్పందన కార్యక్రమంలో ప్రతి అర్జీని అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తిచెందేలా పరిష్కరించాలని కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్పందన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో కలెక్టర్ దిల్లీరావు డీఆర్‌వో వి.శ్రీనివాసరావు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ జి.వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ రజనీ కుమారి తదితరులతో కలిసి అర్జీలు స్వీకరించారు. మొత్తం 118 అర్జీలు రాగా.. వీటిలో రెవెన్యూ 60, ఎంఏయూడీ 6, పోలీస్ 11, విద్య 1, రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ 2, వైద్య, ఆరోగ్యం 4, పంచాయతీరాజ్ 2, హౌసింగ్ 3, పశుసంవర్థకశాఖ 2, మార్కెటింగ్ 2, పౌరసరఫరాలు 9, కో-ఆపరేటివ్ 2, ఏపీసీపీడీసీఎల్ 3, ఉపాధి కల్పన 2, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం 4, సర్వే అండ్ సెటిల్‌మెంట్ 5 అర్జీలు వచ్చాయి. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో అర్జీల పరిష్కారంపై దృష్టిసారించాలని కలెక్టర్ పేర్కొన్నారు.



ఒక ‘పట్టాన’ తేలని ‘అసైన్డ్’

(5వ పేజీ తరువాయి)

పట్టాలు పొందిన రైతులు లేదా వారసులకు ఫారం-1, 2నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు ఇచ్చినట్టు రైతులను నిలబెట్టి ఫొటోలు తీసుకుని, నోటీసులను వీఆర్వోలు వెనక్కు తీసుకుంటున్నారు.

స.హ.చట్టంలో వివరాలు కోరిన టీడీపీ నేతలు

బందరు మండలంలో అసైన్డ్ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేయాలని టీడీపీ నాయకులు సోమవారం సాయంత్రం నాలుగు గంటల సమయంలో సమాచార హక్కు చట్టం తహసీల్దార్ కార్యాలయ అధికారులను కోరారు. అసైన్డ్ భూములకు ఏ ప్రాతిపదికన, ఏ రికార్డుల ఆధారంగా పట్టాలు ఇచ్చేందుకు నోటీసులు జారీ చేస్తున్నారని వివరాలు కోరారు. అసైన్‌మెంట్ చట్టం 9/77సెక్షన్ 3 ప్రకారం భూమి యజమానులకు జారీ చేసిన ఫారం1, 2లను, తహసీల్దార్ కార్యాలయం నుంచి రైతులకు రిజిస్టర్ పోస్టుల ద్వారా పంపిన నోటీసులకు అయిన ఖర్చులకు సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని కోరారు. 30 జనవరి 2024 తేదీన వేసి తహసీల్దార్ సంతకంతో నోటీసులు జారీ చేస్తున్నారని, ఈ తేదీ నాటికి ఆయా గ్రామాలకు సంబంధించిన అడంగల్ కాపీలను కూడా ఆరు రోజుల వ్యవధిలో అందజేయాలని కోరారు. ఈ వివరాల కోసం అయ్యే ఖర్చులకు సంబంధించి రూ.14 వేల విలువైన డీడీలను కూడా అందజేశారు. తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం ద్వారా అసైన్డ్ భూములకు సంబంధించిన వివరాలు కోరుతూ అర్జీ అందజేసిన 20 నిముషాల వ్యవధిలోనే వైసీపీ నాయకులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి అధికారులతో మాట్లాడటం గమనించదగ్గ అంశం.

కోన 1, 2 రెవెన్యూ గ్రామాల్లో 4,200 ఎకరాల అసైన్డ్ భూమి

బందరు మండలంలోని కోన 1, 2 రెవెన్యూ గ్రామాల పరిధిలో 4,200 ఎకరారాల అసైన్డ్‌భూమి ఉన్నట్టు రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. ఈ రెవెన్యూ గ్రామాల పరిధిలోనే భీమవరానికి చెందిన బడాబాబులకు చేపల చెరువులు ఉన్నాయి. అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డులు అందుబాటులో లేకున్నా ఈ 4,200 ఎకరాల భూమి గతంలో ఎవరికి ఇచ్చారనే అంశంపై లెక్కలు తేల్చారు. ఈ అంశం బయటకు రావడంతో కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారులు ఎవరి పేరుతో పట్టాలు ఇచ్చేందుకు ఈ లెక్కలు చూపారని విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కానూరు భూములు.. వివాదాస్పదం

కానూరులో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యేకి 200 ఎకరాల భూమి ఉంది. 20 సంవత్సరాల క్రితమే ఆయన ఈ భూములను కొనుగోలు చేశారు. ఈ భూముల వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. ఈ 200 ఎకరాల భూమిని పెదకానూరుకు చెందిన మత్స్యకారుల పేరున పట్టాలు ఇస్తామని అధికార పార్టీ నాయకులు ఆశపెట్టారు. గ్రామానికి చెందిన మత్స్యకారుల నుంచి ఆధార్‌కార్డులు, బియ్యం కార్డు నెంబర్లను సేకరించి, భూములు ఇచ్చేందుకు జాబితాలను తయారు చేశారు. పట్టాలు ఇస్తామనే కారణం చూపి కొందరు వైసీపీ నాయకులు లబ్ధిదారుల నుంచి ఖర్చుల పేరుతో నగదు వసూళ్లకు పాల్పడినటు గ్రామస్తులు చెప్పుకుంటున్నారు.

బాలిక మృతిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అవనిగడ్డ, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని విశ్వనాథుని శ్రీనివాస్ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి బాలిక మృతిపై ఎస్ఎంసీ చైర్ పర్సన్ ఎం.బేబీ కుమారి, వ్యవస్థాపక కుటుంబసభ్యులు వి.వాసుదేవ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 6న బాలిక ఆత్మహత్య విషయంలో తమ విచారణలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించటంతో మనస్థాపం చెంది ఆమె ఆత్మహత్యకు పాల్పడిందని, పోస్టుమార్టం నిర్వహించకుండానే పోలీసులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారని, బాలిక మృతిపై తమకు అనుమానాలు ఉన్నందున విచారణ నిర్వహించాలని వారు జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఫిర్యాదులో కోరారు. ఈ విషయమై ఎంఈవో శివశంకర్ రావును వివరణ కోరగా, ఫిర్యాదు విషయం తమ దృష్టికి రాలేదని, అయితే ఈనెల 6వ తేదీన బాలిక మృతి చెందిన వాస్తవమేనని తెలిపారు.

పసికందును వదిలి వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు



అవనిగడ్డ : కళ్లు కూడా తెరవని పసికందును చర్చి వెనుక వదిలి వెళ్లిన సంఘటన అవనిగడ్డలో తీవ్ర కలకలం రేపింది. ఆదివారం రాత్రి అవనిగడ్డ 1వ వార్డులోని చర్చి వెనుక అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తు తెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. కొద్ది సేపటికి పాప ఏడుపు వినిపించి చర్చి ఫాదర్ వెంటనే శిశువును ప్రభుత్వాసుపత్రికి, ప్రథమ చికిత్స అనంతరం మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రమేష్ తెలిపారు.



కేశినేని చిన్ని, సౌమ్యకు హారతులు పడుతున్న మహిళలు

శూన్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

- సీఎం జగన్‌పై కేశినేని శివనాథ్ ఫైర్

కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 12 : రాష్ట్రాన్ని శూన్యాంధ్రప్రదేశ్ మార్చిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కిందని సీనియర్ టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. కీసర, పెండ్యాల, వేములపల్లి, ఎస్.అమరవరం గ్రామాల్లో సోమవారం ఆయన నందిగామ మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యతో కలిసి పర్యటించారు. వారికి కీసర జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. పెండ్యాలలో భారీ మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సౌమ్య మాట్లాడుతూ జగన్ పచ్చి అబద్ధాలతో ప్రజలకు మోసం చేశాడన్నారు. ఈకార్యక్రమంలో ఎర్రగాని నూకాలమ్మ, మన్నె సాత్విక, కొంగర మురళి, కుక్కల శ్రీను, ఎర్రగోర్ల రామాంజనేయులు, కలతోటి అజయ్, వేల్పుల వెంకట్రావ్, రెడ్డి నరసింహారావు, షేక్ దిలావర్, షబ్బీర్, ఎం.డి అలీభాష, నసిర్ భాష, మొక్కపాటి నరసింహారావు, భిక్షాలు, వెంకట్రావ్, తేలప్రోలు రమణయ్య వసంత కోటయ్య, వసంత హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.33

నిరుద్యోగ భృతి రూ.10 వేలు ఇవ్వాలి

కంకిపాడు, ఫిబ్రవరి 12 : నిరుద్యోగ యువతను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎస్సీ, ఎస్టీ హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఇంటూరి ఏలియ అన్నారు. కంకిపాడులో సోమవారం నిర్వహించిన దళిత బహుజన కులాల గర్జన మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ, నిరుద్యోగులకు ప్రభుత్వం ఉపాధి కల్పించటంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఉపాధి కల్పించలేని ప్రభుత్వం నిరుద్యోగులకు రూ. 10 వేలు నిరు ద్యోగ భృతి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జనరల్ సెక్రటరీ కుంభా ప్రభుదాస్, కోశాధికారి ఉయ్యాల ఏడుకొండలు, కుంభా వెంకటేశ్వరరావు, గరికె వెంకట దుర్గా ప్రసాద్, లాం ప్రతాప్, టిక్కం ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం కాంగ్రెస్ సీటుకు మట్టా వరసాయి దరఖాస్తు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ పార్టీ తరఫున గన్నవరం నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి తనకు అవకాశం ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసినట్లు ఏపీ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం కో -చైర్మన్ మట్టా వరసాయి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1972 నుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్న తనకు రానున్న ఎన్నికల్లో గన్నవరం సీటును కేటాయించాలని కోరుతూ విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో జిల్లా కమిటీకి దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకులపాడు మాజీ సర్పంచ్ పడకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ దుట్టాపై దుష్ప్రచారం

●జడ్పీటీసీ సీతారామలక్ష్మి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 12 : సీనియర్ వైసీపీ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు ప్రోత్సాహంతో వైసీపీ శ్రేణులు వేరే పార్టీలోకి వెళుతున్నట్లు వస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని మా వర్గాన్ని, మా అనుచరులను ఇతర పార్టీలోకి చేరమని ఎపుడు ప్రోత్సహించ లేదని, ఇక ముందు కూడా ప్రోత్సహిం చబోమని ఉంగుటూరు జడ్పీటీసీ సభ్యురాలు దుట్టా సీతారామలక్ష్మి సోమవారం ఆమె ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తాను, తన కుటుంబం తన తండ్రి దుట్టా రామచంద్రరావు మార్గంలోనే నడుస్తామని, వైఎస్సార్ కుటుంబంతో మా అనుబంధం విడదీయలేనిదని, మా అనుచరులు వేరే పార్టీలోకి చేరుతున్నట్లు వస్తున్న ప్రచారాన్ని ఆమె ఖండించారు.

అన్నదాతకు అండగా టీడీపీ

పార్టీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ



ట్రాక్టర్ల ర్యాలీలో శ్రేణులను ఉత్సాహపరుస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, చలమలశెట్టి రమేష్‌బాబు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 12 : పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణాడెల్టాకు అందించడంతో పాటు వేలాది ఎకరాల మెట్టప్రాంతాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత టీడీపీతోనే సాధ్యమయిందని, టీడీపీ అన్నదాతకు ఎప్పుడూ అండగా నిలుస్తుందని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. వేలేరులో, ఎస్.ఎన్. పాలెం శివారు ముందడుగు కాంప్లెక్స్‌లో సోమవారం టీడీపీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబుతో కలిసి ఆయన పాల్గొన్నారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలేరు అడ్డరోడ్డు వద్ద నుంచి 50కుపైగా ట్రాక్టర్లతో రైతులు, వందలాది ద్విచక్ర వాహనాలతో టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. రైతు నూతనంగా కొన్న ట్రాక్టరును యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించి స్వయంగా నడిపి శ్రేణుల్లో జోష్ నింపారు. అనంతరం వేలేరు కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతూ, టీడీపీ మ్యానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల ద్వారా చేకూరే లబ్ధిని వివరించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే అంపాపురం వద్ద పోలవరం- ఏలూరు కాలువ అనుసంధానం పనులను పునరుద్ధరించి త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. వేలేరుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కాజా సురేష్, కార్యదర్శి అంగడాల సీతయ్య, యువత అధ్యక్షుడు పోలగాని వెంకటేశ్వరరావు, మహిళా కమిటీ అధ్యక్షురాలు వల్లూరి రాణి, శ్రీకాకుళపు రాజేష్, బర్రే బసవరాజు, గోళ్ల శివ నాగమల్లేశ్వరరావు, కలాం బాషా, పోలిమెట్ల మరియన్న, రాచప్రోలు సతీష్, అశోక్, షేక్ గౌస్, చోరగుడి చిట్టియ్య, ఆళ్ల గోపాలకృష్ణ, చిరుమామిళ్ల సూర్యం, మూల్పూరి సాయికళ్యాణి, దొంతు చిన్నా, గుండపనేని ఉమావరప్రసాద్, దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, అవిర్నేని భవానీశంకర్, రవీంద్ర, ద్రోణవల్లి రామారావు, మాళావతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైనింగ్ దందా సాగనివ్వం

జోగి ముఠాపై మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ఆగ్రహం



పెనమలూరులో జరిగిన కార్యక్రమంలో బోడె ప్రసాద్ తదితరులు

పెనమలూరు, ఫిబ్రవరి 12 : ఇసుక అక్రమ మైనింగ్ జరపకూడదంటూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు, జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలు లెక్క చేయకుండా యథేచ్ఛగా దోపిడీ చేస్తున్న జోగి రమేశ్ అనుచరుల అక్రమ దందాలను టీడీపీ శ్రేణులు అడ్డుకోగలిగాయని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పెనమలూరు పల్లిపేటలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రజలతో మాట్లాడారు. ఎవడబ్బ సొమ్మని కృష్ణానదిలో ఇసుకను దోపిడీ చేస్తున్నారని ప్రశ్నించారు. కోట్ల రూపాయల అక్రమ సంపాదనతో ఓట్లు కొని ఎన్నికలను ప్రభావితం చేద్దామనే పన్నాగంతో జేసీబీలు, భారీ ఇసుక డంపర్లు, టిప్పర్లతో దందాకు తెరతీశాడని ఆరోపించారు. పెనమలూరు నియోజకవర్గంలో వైసీపీ, జోగి ముఠా ఎటువంటి అక్రమాలకు పాల్పడినా టీడీపీ శ్రేణులు అడ్డుకుంటాయని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, సంగెపు రంగారావు, తోటకూర ఉదయభాస్కర్, బొమ్మిడి అన్నపూర్ణ, గోపీచంద్, సుభాని, మల్లయ్య, కంచర్ల శ్రీను, సైదులు, సతీష్, కిలారు ప్రసాద్, సాంబశివరావు తదితరులు ఉన్నారు.

చోడవరంలో బోడె హేమ ఆధ్వర్యంలో..

చోడవరంలో జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో బోడె ప్రసాద్ సతీమణి హేమ పాల్గొని టీడీపీ జనసేన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్‌ను, ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట కలపాల శ్రీధర్, చోడవరపు హేమలత, లింగాల శివ, మొవ్వ బ్రహ్మేశ్వరరావు, నెప్పల్లి హరీష్, వెలిసెల రఘు, కోలవెను మురళి, కల్లోటి రామకృష్ణ, కృష్ణవేణి, గవిర్నేని సీత, మాద్దాల స్వరూపరాణి, మద్దాల వీరయ్య, కమతం శ్రీనివాస్, మన్నే సతీష్, మల్లంపాటి సుబ్బారావు తదితరులు ఉన్నారు.



సనత్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో బోడె వెంకట్రామ్

కానూరు సనత్‌నగర్‌లో..

కానూరు సనత్‌నగర్‌లో టీడీపీ యువనాయకులు బోడె వెంకట్రాం, టీడీపీ రెహమాన్, కృష్ణా జిల్లా మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్‌బుజ్జిలు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని స్థానికులకు టీడీపీ జనసేన మేనిఫెస్టోను వివరించారు. టీడీపీ జనసేన చారిత్రాత్మక కలయిక రాష్ట్ర భవిష్యత్తును మలుపు తిప్పుతుందని పేర్కొన్నారు. వారి వెంట అంగిరేకుల మురళి, రియాజ్, రమేష్, అబ్దుల్ రెహమాన్, కొండ, నాగబాబు, రఫీ, కోసూరి రమేష్ తదితరులు ఉన్నారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం

ఉయ్యూరు : రాష్ట్రంలో అరాచక, అవినీతి, అసమర్థ పాలనతో ప్రజలు విసిగి వైసీపీని ఓటు ద్వారా సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్, స్మిత అన్నారు. బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉయ్యూరు ఒకటవ వార్డులో పర్యటించి చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు నరేంద్ర, శివ, సత్యనారాయణ, కరీంబేగ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ బాక్సింగ్ పోటీల్లో అఫియా జబిన్‌కు బంగారు పతకం



బంగారు పతకం సాధించిన అబ్దుల్ అఫియా జబిన్

ఉయ్యూరు, ఫిబ్రవరి 12 : ఖేలో ఇండియా ఆర్‌ఈసీ ఓపెన్ టాలెంట్ సబ్ జూనియర్ బాలికల సౌత్ జోన్ బాక్సింగ్ పోటీల్లో ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ అఫియా జబిన్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. బెంగళూరులో జయప్రకాశ్ నారాయణ నేషనల్ యూత్ సెంటర్‌లో ఈ నెల 2నుంచి 9వ తేదీవరకు జరిగిన 35- 37 కిలోల విభాగంలో అఫియా జబిన్ విశేష ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించింది. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్, స్థానికులు కొండలరావు, రామచంద్రరావు, బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఉమా మహేశ్వరరావు పలువురు ప్రముఖులు జబిన్‌ను ఆమెకు శిక్షణ నిచ్చిన సూర్యను అభినందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బొమ్ములూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జయసూర్య, సీఐ

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 12 : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద మౌలికవసతులు, బందో బస్తు తదితర విషయాలపై గ్రామీణ ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించడం జరిగిందని డీఎస్పీ జయసూర్య తెలిపారు. బొమ్ములూరు, కొయ్యూరు గ్రామాల్లోని ఎంపీపీ స్కూళ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలతో పాటు పరిసరాలను సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో పోలింగ్ జరిగే ఆవరణ, ప్రహరీ, ఓటింగ్ వచ్చే వారి వాహనాల పార్కింగ్‌కు తగిన ఏర్పాట్లు, తదితర విషయాలను పరిశీలించి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా తగుజాగ్రత్తలు తీసుకోవాలని సీఐ నరసింహమూర్తికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జనార్దన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కంకిపాడు, ఫిబ్రవరి 12 : పేకాట, కోడి పందెం రాయుళ్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కంకిపాడు ఎస్సై సందీప్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మండలంలోని 20 గ్రామాల్లో పోలీసుల నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పేకాట, కోడి పందేలు నిర్వాహకులతో పాటు ఆడేందుకు వెళ్లే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కంకిపాడులో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 1420 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 9440627044కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



గన్నవరంలో రోడ్డు భద్రత వారోత్సవాల ర్యాలీ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

గన్నవరం, ఫిబ్రవరి 12 : రోడ్డు భద్రతను తప్పనిసరిగా పాటించాలని డిపో మేనేజర్ పి.శివాజీ అన్నారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో రోడ్డు భద్రత మాసోత్సవాలు సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ శివాజీ మాట్లాడుతూ, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. రహదారి భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అతివేగం ప్రమాదకర మన్నారు. డ్రైవర్‌లు విధి నిర్వహణలో ప్రశాంతంగా ఉన్నప్పుడే సురక్షితంగా గమ్యాలను చేరుకోవచ్చన్నారు. ఆర్టీసీ సూపర్ వైజర్‌లు మధు, అంబాలరావు, సురేష్, అసోసియేషన్ నాయకులు ఎండీ ప్రసాద్, రత్నాకర్, నాగిరెడ్డి, ఏఎస్‌రావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

న్యాయాధికారి షర్మిల మృతి బాధాకరం



షర్మిల చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

గన్నవరం, ఫిబ్రవరి 12 : గన్నవరంలో న్యాయాధికారిగా పనిచేసి ప్రస్తుతం కర్నూల్‌లో విధులు నిర్వహిస్తున్న డి.షర్మిల అనారోగ్యంతో మృతి చెందటం బాధాకరమని పలువురు న్యాయవాదులు అన్నారు. సోమవారం స్థానిక గన్నవరం ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయాధికారిగా గన్నవరంలో ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. బార్ అసోసియేషన్ ఆఫ్ సభ్యులు తిరివీధి వెంకయ్య, సీనియర్ న్యాయవాది కలపాల వెంకట రమణ, అమర్తల సోమేశ్వరరావు, జాస్తి తాతారావు, ఎస్టీజీ నీరజ, తాడిపర్తి వెంకట్రావు పాల్గొన్నారు.

టైగర్ పవర్‌క్లబ్ విద్యార్థులకు పతకాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 12 : రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో గ్రామీణ ప్రాంతానికి చెందిన టైగర్ పవర్‌క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించడం అభినందనీయమని రాష్ట్ర కిక్ బాక్సింగ్ అధ్యక్షుడు విమలరాజు అన్నారు. పార్వతీపురంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ కిక్‌బాక్సింగ్ పోటీల్లో టైగర్ పవర్‌క్లబ్ విద్యార్థులు ప్రతిభ కనబరచిన సందర్భంగా సోమవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. సందీప్ 65 కేజీల విభాగంలో బంగారు పతకం, ప్రబోదయ 50 కేజీల విభాగంలో బంగారు పతకం, జూపాక అలెన్‌శామ్యూల్ 30 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించారని కోచ్ అంజిబాబు వివరించారు.

విద్యార్థులకు ప్లేట్లు, బాటిల్స్ పంపిణీ

ఉప్పలూరు (కంకిపాడు), ఫిబ్రవరి 12 : విద్యార్థులు కష్టంగా కాకుండా ఇష్టంగా చదువుకోవాలని ఉప్పలూరు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ పడవల మధుసూదనరావు అన్నారు. వెంగళసీతారామయ్య, రాఘవమ్మ జ్ఞాపకార్థం ఉప్పలూరు ఆర్సీఎం స్కూల్‌లో విద్యార్థులకు ప్లేట్లు, వాటర్ బాటిళ్లను ఆయన సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొడ్డు నాగమల్లేశ్వరరావు, బండారు మురళి, బిట్రా అశోక్, ప్రధానో పాధ్యాయులు ప్రసన్న, ఉపాధ్యాయులు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉంగుటూరు, ఫిబ్రవరి 12 : వ్యాధుల పట్ల నిర్లక్ష్యాన్ని వీడి సకాలంలో సరైన వైద్యసేవలు పొందటం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని, ముఖ్యంగా దృష్టి లోప సమస్యలకు సకాలంలో స్పందించాలని ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ శంకర్ సూచించారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో పొట్టిపాడు శివారు నారయ్య అప్పారావుపేటలో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంప్‌లో భాగంగా సోమవారం కంటి, క్యాన్సర్ వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ అంకాలజిస్టు డాక్టర్ తేజస్విని మహిళలకు వచ్చే క్యాన్సర్ల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శ్రీహరిబాబు, వైద్యనిపుణుల బృందం పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

గండిగుంట(ఉయ్యూరు), ఫిబ్రవరి 12 : గండిగుంట గణపతి సచిదానంద జ్ఞానబోధ సభ ప్రాంగణంలో కార్యసిద్ధి ఆంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దత్తపీఠ ఉత్తరాధికారి దత్త విజయానందస్వామి ఈ కార్యక్రమంలో పాల్గొని పూజాది కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించి విగ్రహ పునఃప్రతిష్ఠ గావించారు. ఈ సందర్భంగా చక్రపూజ, ప్రతిష్ఠాహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. భక్తులు నిత్యం హనుమాన్‌చాలిసా పారాయణం చేయాలని ఉద్బోధించారు. జ్ఞానబోధ సభ మేనేజింగ్ ట్రస్టీ మంజుల సభ్యుల పర్యవేక్షణలో పెద్దయెత్తున అన్న సమారాధన చేశారు.



హోమంలో పూర్ణాహుతి చేస్తున్న దత్త విజయానందస్వామి



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	143, 152, 163
చికెన్ విత్ స్కిన్	274
చికెన్ స్కిన్‌లెస్	284

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.33

తాగునీటి పైప్‌లైన్ పునరుద్ధరించాలని ఆర్టీసీ కాలనీ వాసుల వినతి

గుడివాడ, ఫిబ్రవరి 12 : రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం కారణంగా పైపులైన్‌ను తొలగించారని, రెండు నెలలు కావస్తున్నా పునరుద్ధరించలేదని ఆర్టీసీ కాలనీ వాసులు వాపోయారు. వెంటనే పైప్‌లైన్ ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యం కల్పించకుంటే ము న్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావును సోమవారం కలిసి తమ సమస్యను వివరించారు. అసిస్టెంట్ కమిషనర్ స్పందించి వెంటనే వాటర్ వర్క్స్ ఏఈని పిలిచి రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. మాజీ కౌన్సిలర్ లింగం ప్రసాద్ గోపి, దాసరి సుబ్బారావు, బ్రహ్మాజీ, పొట్లూరి రాజా, శ్రీధర్ ప్రసాద్, గంగాధర్, చింతపల్లి లక్ష్మీనారాయణ, త్రిపురనేని రవిబాబు తదితరులు పాల్గొన్నారు.


వెణుతురుమిల్లిలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల రాము


ఆకులమన్నాడులో కరపత్రాలు అందజేస్తున్న కాగిత కృష్ణప్రసాద్


సీతారామపురంలో పర్యటిస్తున్న కుంచె నాని తదితరులు


అవనిగడ్డలో కరపత్రాలు అందజేస్తున్న మండలి వెంకట్రామ్

వైసీపీని పారదోలుదాం

● బాబు ష్యూరిటీ కార్యక్రమంలో వెనిగండ్ల, కాగిత, వెంకట్రామ్ పిలుపు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 12 : వైసీపీ దుర్మార్గుల కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని, గుడివాడను కాపాడుకుందామని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. వెణుతురుమిల్లి, వేమవరం గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో రాము పాల్గొన్నారు. తె లుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వం రాగానే చంద్రబాబు గుడివాడకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరతాయన్నారు. మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు వల్లభనేని బాబూరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, జంగం మోహనరావు, శాయిన పుష్పావతి, తూము పద్మజ, కొప్పినేని పిచ్చేశ్వరరావు, పామర్తి సత్యనారాయణ, శేష వేణి, మన్నెం పద్మావతి, బూరగడ్డ శ్రీకాంత్, పేర్ని జగన్, సందు పవన్, మజ్జి శ్రీనివాస్ పాల్గొన్నారు. కాగా, వేమవరానికి చెందిన వంకా గౌరీ శంకర్, తమ్మిశెట్టి సత్యనారాయణ, వేముల దుర్గారావు, కాటే చంద్రరావు, మన్నె నాగబాబు తమ అనుచరులతో టీడీపీలో చేరారు. వెనిగండ్ల రాము, కొసరాజు బాపయ్య చౌదరి వారిని సాదరంగా ఆహ్వానించారు. మన్నెం నరసింహారావు, అబ్దుల్ అమీన్, మన్నెం వీర నాగేంద్రరావు, సత్తార్, అంకాలరావు, ఈడే కృష్ణారావు పాల్గొన్నారు. **పెడన :** టీడీపీ, జనసేన ప్రభుత్వం వస్తే పథకాలు రద్దవుతాయంటూ వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కాగిత కృష్ణప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆకులమన్నాడు గ్రామంలో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కృష్ణప్రసాద్ ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. భవిష్యత్తుకు గ్యారంటీ బాండ్లను అందజేశారు. పోతన స్వామి, నాగబాబు, బేగ్, రఫీ, కాసగాని శ్రీనివాసరావు, ము నీశ్వరరావు, సిరివెళ్ళ శ్రీనివాసరావు, సూర్యనారాయణ, రాము, భాస్కర్, కామేశ్వరమ్మ పాల్గొన్నారు. **అవనిగడ్డ :** చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ అన్నారు. అవనిగడ్డ నాల్గో వార్డు పరిధిలో బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను ప్రజలకు అందజేశారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, బండే రాఘవ, నడకుదుటి జనార్ధనరావు, రావి నాగేశ్వరరావు, అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, బచ్చు రఘునాథ్, అడపా శ్రీను, లుక్కా శ్రీనివాసరావు, మండలి రామ్మోహనరావు, యలవర్తి ఆది, విశ్వనాథుని మురళీ, గుగ్గిలం శ్యాంకుమార్, ఎలవర్తి చిన్నా, దాసినేని శ్రీనివాసరావు, మొగల్ మురాద్ బేగ్, గరికపాటి హరి, భోగిరెడ్డి బుజ్జి, కొల్లూరి ఇమ్మానియేలు, హరిబాబు, రేపల్లె అంకి నీడు, రాంబాబు, చెన్ను బాబురావు, చెన్ను గాంధీ పాల్గొన్నారు. **నాగాయలంక :** నంగేగడ్డ తొమ్మిదో వార్డు దళిత వాడలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వ హించారు. టీడీపీ నాయకులు ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. నంగేగడ్డ మాజీ సర్పంచ్ బావిరెడ్డి వెంకటేశ్వరరావు, భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయ భాస్కర్, బూత్ కన్వీనర్ బావిరెడ్డి రవీంద్ర, గ్రామ టీడీపీ అధ్యక్షుడు తాడేపల్లి పాపారావు, ఈపూరి నాగార్జున, కీర్తి రాజు, తాడేపల్లి శ్రీనివాస రావు, నాగబాబు, పరిశె సీతారామయ్య, పరిశె శ్రీను పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** యువత కన్నెర్ర చేస్తే రానున్న ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయమని రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కుంచే నాని అన్నారు. సీతారామపురం, గొల్లపాలెం, సుల్తానగరం, చిట్టిపాలెం గ్రామాల్లో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహించారు. కుంచే నాని, తెలుగు యువత ప్రతినిధి ఈడే వెంకటదాసు, వీరంకి నాగముని, కొనకళ్ళ గోపీ, చిట్టిబొమ్మ వనరాజు, అమ్మిరెడ్డి శివయ్య, ఈడే సుబ్బు, రాజులపాటి సాయి, వీరయ్య, నాగవిజయ్, శివకుమార్, కృష్ణ తదితరులు ఇంటింటికీ విస్తృతంగా పర్యటించారు. వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు.

మహిళ దుర్మరణం

గుడివాడ రూరల్ : గుర్తు తెలియని వాహనం ఢీకొని లింగవరం గ్రామానికి చెందిన నల్లూరి బసవమ్మ (52) దుర్మరణం చెందింది. లింగవరం రోడ్డు పక్కన సోమవారం మేకలు మేపు తున్న బసవమ్మను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపి స్తున్నారు.

చెరువులను నింపుకోవాలి

అవనిగడ్డ రూరల్ : పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధతో తాగునీటి చెరువులను నింపుకోవాలని ఇరిగేషన్ డీఈఈ పి.రవికిరణ్ సూచించారు. కాల్వలకు మరో రెండు రోజులపాటు నీరు విడుదలవుతుందన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ : డీఎస్పీ శ్రీకాంత్



గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 12 : హెల్మెట్ ధారణతో రోడ్డు ప్రమాదాల బారి నుంచి బయటపడవచ్చని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్ వద్ద రహదారి భద్రతా చర్యలపై బైక్ ర్యాలీని పచ్చజెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం స్టేషన్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం వలన వారి ప్రాణాలు కాపాడుకోవచ్చని ఆయన చెప్పారు. గుడివాడ రూరల్ సీఐ కె.ఏసుబాబు, గుడ్లవల్లేరు ఎస్సై జి.సత్యనారాయణ, ఎంపీడీవో దారపు శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, ఏఎస్సైలు సారధి, సాంబశివరావు, శంకర్‌లు పాల్గొన్నారు.

కూచిపూడి నాట్య పరీక్షలు ప్రారంభం

కూచిపూడి : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో ఎంపీఏ మొదటి సంవత్సరం నాట్య రాత పరీక్షలు సోమవారం కళాపీఠంలో ప్రారంభమయ్యాయి. నాటక క్రమ వికాసం అంశంలో పరీక్షలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 18 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా వేదాంతం రామలింగశాస్త్రి, ఎగ్జామినర్‌గా వేదాంతం వెంకట దుర్గా భవాని వ్యవహరించారు.

జీఈసీ వేదికగా 10కె, 3కె రన్ 15న

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల రజతోత్సవం సందర్భంగా ఈనెల 15న పురుషులకు 10కె, మహిళలకు 5కె రన్ నిర్వహించనున్నామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్ తెలిపారు. కళాశాలలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పురుషుల్లో మొదటి ఐదుగురు విజేతలకు వరుసగా రూ. 20,000, రూ. 15000, రూ. 10,000, రూ. 7,500,రూ. 5000, మహిళల్లో మొదటి ఐదుగురు విజేతలకు రూ. 10,000, రూ. 7,500, రూ. 5000, రూ.3000, రూ. 2,000 చొప్పున అందజేస్తామన్నారు. వివరాలకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌ను 9959592638 , కో-ఆర్డినేటర్ 9441698556 సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

మహాసేన రాజేష్‌ను కలిసిన దళిత నేతలు

నాగాయలంక : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మహాసేన రాజేష్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎమ్మెస్.రాజును విజయవాడలో అవనిగడ్డ నియోజకవర్గంలోని టీడీపీ ఎస్సీ నేతలు కర్రా సుధాకర్, మాచవరపు ఆదినారాయణ, మేడికొండ విజయ్ మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఎస్సీలపై జరుగుతున్న దాడులపై చర్చించారు.

టీడీపీ వస్తేనే యువతకు బంగారు భవిష్యత్తు


నాగాపురంలో టీడీపీలో చేరిన వారితో వర్ల కుమార్ రాజా

పెదపారుపూడి, ఫిబ్రవరి 12 : యువత బంగారు భవిష్యత్‌కు టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎంగా తెచ్చుకోవాలని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వర్ల కుమార్ రాజా అన్నారు. పులవర్తి దళితవాడ, వింజరంపాడు, నాగాపురం తదిరత గ్రామాల్లో సోమవారం ఆయన పల్లెబాట నిర్వహించారు. పులివర్తి దళితవాడలో పల్లె నిద్ర అనంతరం మహిళలు గ్రామస్తులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హులకు స్థలాలు, ఇళ్లు రాలేదని వాపోయారు. డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు సూరపనేని వెంకట సత్యనారాయణ, కార్యదర్శి మసిముక్కు రాంబాబు, గొరిపర్తి రవికుమార్, కూచిపూడి సుబ్బయ్య, బుడ్డాలు, మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కూచిపూడి జ్యోతి, కూచిపూడి సీతామహాలక్ష్మి చౌదరి, బంగారు బాబు, జమ్మి బాబు, గోగం రామారావు, జాస్తి రామచంద్రరావు, కాగిత లక్ష్మీనారాయణ, గుండపనేని శ్రీనివాసరావు, సజ్జ శివకుమార్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాగాపురం గ్రామంలో సుమారు వంద మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. కుమార్ రాజా పార్టీ కండువా కప్పి ఆహ్వానం పలికారు.

కారు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి

పమిడిముక్కల, ఫిబ్రవరి 12 : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై గోపువాని పాలెం అడ్డ రోడ్డు సమీపాన సోమవారం కారు ఢీకొని ఆటో డ్రైవర్ మృతి చెందాడు. రవాణా ఆటో నడుకుంటూ జీవనం సాగించే విజయవాడ భవానీపురానికి చెందిన కె.పున్నయ్య(52) మచిలీపట్నం నుంచి ఇనుప సామాను లోడుతో విజయవాడ వస్తుండగా కారు ఢీకొంది. దీంతో ఆటో డివైడర్‌ను ఢీకొని పున్నయ్య రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల ఆగ్రహం

మోపిదేవి, ఫిబ్రవరి 12 : మండల స్థాయి అధికారులు రానప్పుడు సమావేశాలు నిర్వహించటం ఎందుకని మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మోపిదేవి మండల సర్వసభ్య సమావేశం సమావేశం ఎంపీపీ రావి దుర్గావాణి అధ్యక్షతన జరిగింది. విద్య, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, ఇరిగేషన్ తదితర శాఖల సిబ్బంది ఎవరు రాకపోవటంతో సభ్యులు అధికారులను నిలదీశారు. మోపిదేవి లేఅవుట్ -3లో ఆక్రమణలపై ఎంపీటీసీ సభ్యుడు కొమ్ము పవన్ కుమార్, కొక్కిలిగడ్డ సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు ప్రశ్నించారు. కొక్కిలిగడ్డ, బొబ్బర్లంక, కొత్తపాలెం గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించటంలోనూ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవటం లేదంటూ నిలదీశారు. అర్హత ఉండి పింఛన్లు ఎందుకు మంజూరు కావడం లేదంటూ వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు ఎంపీడీవో కె.శ్రీనివాసరావును ప్రశ్నించారు. వైస్ ఎంపీపీ నడకుదుటి జననీ కుమారి, కడవకొల్లు సీతారామాంజనేయులు, ఆయా శాఖల అధికారులు ఉన్నారు.

ఉత్తమ అధికారులకు పౌర సత్కారం



గురజాడ(పమిడిముక్కల), ఫిబ్రవరి 12 : చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేస్తే ప్రజామన్ననలందుకుంటారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలో ఉత్తమ సేవలందించి ప్రభుత్వ పురస్కారాలు అందుకున్న సీఐ ఎం.కిషోర్‌బాబు, చోరగుడి గ్రామపంచాయతీ కార్యదర్శి టీవీ రమణ ఇతర అధికారులను సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ ఆధ్వర్యంలో గురజాడలో పౌర సత్కారం జరిపారు. చోరగుడి సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి, కూడేరు కార్యదర్శి స్వామి, పమిడిముక్కల ఎస్సై శ్రీనివాస్‌లను కూడా ఘనంగా సత్కరించారు. సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ఉయ్యూరు నగరపంచాయతీ కౌన్సిలర్లు పూర్ణిమ, నాగేంద్రప్రసాద్, తాడంకి సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, శొంఠి వెంకటేశ్వరరావు, గురజాడ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పీవీకి భారతరత్న ముదావహం

మచిలీపట్నం టౌన్ , ఫిబ్రవరి 12 : భారతదేశ ఆర్థిక సంస్కరణలకు నాంది పలికిన మాజీ ప్రధాని పివినరసింహారావు చేసిన కృషి మరువలేమని జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. మచిలీపట్నం పార్కు వద్ద్న పి.వి.నరసింహారావు విగ్రహానికి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలి తెలుగు ప్రధాని పి.వి.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం ముదావహమన్నారు. జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, ఉపాధ్యక్షుడు మహమ్మద్ సమీర్, జనసేన నాయకులు ఎస్వీ బాబు, కర్రి మహేష్, ఈమన మణిబాబు, మోకా రవి, కూనసాని నాగబాబు,విన్నకోట శ్రీకాంత్, లక్ష్మణ, గణేష్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి



రైతులకు మెరుగైన సేవలు అందించాలి

గుడివాడ రూరల్ : రైతులకు మెరుగైన సేవలు అందించాలని దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశానికి దుక్కిపాటి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ మేకల సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించామన్నారు. ఎంపీపీ గద్దె పుష్పరాణి, జడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణ, గుడివాడ మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మట్టా నాగమణి తదితరులు ప్రసంగించారు. ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవో అనంతలక్ష్మి, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీసభ్యులు సలహా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



620 మందికి కళ్లజోళ్ల పంపిణీ

చల్లపల్లి : నిరుపేదలకు మాదివాడ వెంకట కృష్ణ (క్రిస్టియన్) అందిస్తున్న సేవలు అభినందనీయమని జనసేన రాష్ట్ర కార్యదర్శులు అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్ అన్నారు. అక్షయ డెవలపర్స్ అధినేత, నియోజకవర్గ జనసేన నాయకులు మాదివాడ క్రిస్టియన్ ఆధ్వర్యంలో 620 మందికి కళ్లజోళ్ల పంపిణీ సోమవారం చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో జరిగింది. జనసేన జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన నేతలు నెరుసు కృష్ణాంజనేయులు, ఉస్మాన్ షరీఫ్, చోడగం విమల్‌కృష్ణ, పూషడపు రత్నగోపాల్, మర్రె గంగయ్య, అడపా రాంబాబు, సూదాని నందగోపాల్, పసుపులేటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



దొంతులమ్మ సంబరం ప్రారంభం

మచిలీపట్నం టౌన్ : ఉల్లింగిపాలెంలో దొంతులమ్మ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చండీహోమం నిర్వహించారు. లంకిశెట్టి బాలాజీ, వనజ, పల్లపోతు నాగపృథ్వి, నాగసుష్మ దంపతులు కలశ స్థాపన చేశారు. వేదపండితులు ముట్నూరి రవికుమార్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. కమిటీ అధ్యక్షుడు సైకం సోమశేఖర్, రంగనాయకులు పర్యవేక్షించారు.

సమన్వయంతో పనిచేయాలి

కోడూరు : వివిధ శాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి వివిధ శాఖల అధికారులు వివరించారు.



విశ్వనాథపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా దుర్గారావు

కోడూరు : విశ్వనాథపల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా తోట దుర్గారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మె ల్యే సింహాద్రి రమేష్‌బాబు విచ్చేశారు. రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని కోరారు. జిల్లా రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ కడవకొల్లు నరసింహారావు, ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి, జడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఉల్లిపాలెం పీఏసీఎస్ చైర్ పర్సన్ కటకం కుటుంబరావు, కొండవీటి వెంకట నారాయణ రావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సకాలంలో వేతనం చెల్లించాలి

పెదపారుపూడి : ఉపాధి హామీ పథకం కూలీలకు సకాంలో వేతనం చెల్లించాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిదేనని జిల్లా అంబుడ్స్ పర్సన్ కర్లపాటి వెంకట శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా తనిఖీలో పాల్గొని పథకం అమలు తీరును ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం అమలులో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎంపీపీ గోగం సురేష్, డ్వామా పీడీ సూర్యనారాయణ, ఏపీడీ నాంచారరావు, సురేష్, సోషల్ ఆడిట్ బృందం పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో జగదీష్‌కుమార్ ప్రతిభ



నాగాయలంక : హైదరాబాద్‌లో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్‌లో మరియపురం గ్రామానికి చెందిన తూము జగదీష్ కుమార్ 70 ప్లస్ వయస్సు కేటగిరి ట్రిపుల్ జంప్ లో రజత పతకం సాధించినట్లు నాగాయలంక జడ్పీ పాఠశాల పీడీ గాజుల లక్ష్మీప్రసాద్ తెలిపారు. పలువురు ప్రముఖులు జగదీష్‌కుమార్‌ను అభినందించారు.